పొలాలకు దారేది..?


అయిజ శివారులో నిర్మిస్తున్న భారతమాల జాతీయ రహదారి

బాటను మింగిన భారత్‌మాల

- ఆరు మండలాల మీదుగా ఆరు వరుసల రోడ్డు నిర్మాణం
- జిల్లాలో మొత్తం 53 కి.మీ. హైవే.. 745 ఎకరాలు కోల్పోయిన రైతులు
- పంట పొలాలకు వెళ్లే దారులన్నీ మూతబడిన వైనం
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు

అయిజ: ప్రయాణికుల సౌకర్యార్థం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన భారత్‌మాల (ఆరు వరుసల హైవే రోడ్డు) రైతుల పాలిట శాపంగా మారింది. పంట పొలాలకు వెళ్లేందుకు రైతులు ఏర్పాటు చేసుకున్న దారులు సైతం రోడ్డు నిర్మాణంతో మూతపడుతున్నాయి. దీంతో రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. రోడ్డు నిర్మాణం పూర్తయితే రైతులు వారి పంట పొలాలకు వెళ్లేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.

ఆరు మండలాల్లో రోడ్డు నిర్మాణం

జిల్లాలోని ఆరు మండలాల్లో భారతమాల రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయిజ, మల్దకల్, కేటీదొడ్డి, గట్టు, మల్దకల్, రాజోళి మండలాల మీదుగా హైవే నిర్మాణం చేపట్టారు. మొత్తం 53 కి.మీ. దూరం రోడ్డు నిర్మాణం చేపట్టారు. దానికోసం రైతుల నుంచి ప్రభుత్వం 775 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. అందులో సుమారు 35 ఎకరాల ప్రభుత్వ భూమి కూడా ఉంది. ఏళ్ల నుంచి పంట పొలాలకు ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా వెళ్లేందుకు బాట ఏర్పాటు చేసుకోగా.. తాజాగా హైవే నిర్మాణంతో చాలామటుకు రోడ్లు మూసుకుపోతున్నాయి. ఎరువులు, కోతకు వచ్చిన పంటను, నీరు పట్టేందుకు తమ పొలాలకు ఎలా వెళ్లాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ హైవే పూర్తి అయితే ఐదు కిలోమీటర్లకు ఒక చోట యూటర్న్ ఏర్పాటు చేస్తారని, దీంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తోందని, ఇప్పటికైనా హైవే అథారిటీ అధికారులు స్పందించి పొలాలకు వెళ్లే బాటలకు ప్రత్యామ్నాయం చూపాలని వందలాది రైతులు కోరుతున్నారు.

రైతుల నుంచి సేకరించిన భూ వివరాలిలా..

గ్రామ శివారు	విస్తీర్ణం (ఎకరాల్లో)
వెంకటాపురం	35.168
జూలకల్	24.0180
కుచినెర్ల	90.694
అరగిద్ద	12.567
గట్టు	61.575
తాటికుంట	3.715
నాగర్‌దొడ్డి	0.72
గొర్లఖాన్‌దొడ్డి	1.063
తప్పెట్ల మొర్సు	66.357
దేవబండ	41.379
బింగుదొడ్డి	38.42
యాపదిన్నె	30.56
కొంకల	64.682
బుడమొర్సు	29.91
రాజోళి	77.473
నందిన్నె	14.575

ఇబ్బంది కలగకుండా చూడాలి



భారత్‌మాల రోడ్డు నిర్మాణంలో రైతుల పంట పొలాలకు వెళ్లేదారులు మూసుకపోయాయి. రైతులు వారి పంట పొలాలకు వెళ్లేందుకు వీలులేకుండా పోతుంది. హైవేలో అక్కడక్కడ ఏర్పాటు చేసిన దారిలోనే రైతులు వెళ్లాల్సి ఉంటుంది. దానికోసం రెండు మూడు కి.మీ. దూరం ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అధికారులు స్పందించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలి

– కృష్ణారెడ్డి, రైతు, గుడుదొడ్డి

రైతుల పాలిట శాపం కారాదు



ప్రభుత్వం చేపట్టిన ఆరు వరుసల హైవే రోడ్డు నిర్మాణం రైతులపాలిట శాపంగా మారింది. రైతులు పొలాలకు వెళ్లేందుకు ఎడ్ల బండ్ల రస్తా మూసుకపోయింది. దీంతో రైతులు తమ పంట పొలాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఎక్కడెక్కడ పంటపొలాలకు దారులు ఉన్నాయో ఆప్రదేశాల్లో హైలెవల్ బ్రిడ్జిలు ఏర్పాటు చేసి కింద పంటపొలాలకు దారి వదలాలి.

– నారాయణ, రైతు, అయిజ

అధికారులు స్పందించాలి



పొలాలకు వెళ్లే రోడ్లు మూసుకుపోకుండా హైవే నిర్మాణ పనులు పూర్తిచేసేలా అధికారులు చర్యలు చేపట్టాలి. ఇదే విషయమై తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేశాం.

– నాగిరెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షుడు

సమస్య పరిష్కరిస్తాం



రోడ్డు నిర్మాణంలో పంటపొలాలకు సంబంధించిన రోడ్లు మూసుకుపోయాయని, సమస్యను పరిష్కరించాలని రైతులు ఆయా తహసీల్దార్లకు చేసిన వినతులు పరిశీలిస్తాం. నివేదికను సంబంధిత అధికారులకు పంపిస్తాం. నేషనల్ హైవే అథారిటీ వారు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతాం.

– అపూర్వ్‌చౌహాన్, అదనపు కలెక్టర్

క్లుప్తంగా

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే



అలంపూర్: బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం మంగళవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిసినట్లు తెలిపారు. అలంపూర్ అసెంబ్లీ స్థానానికి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత తొలిసారి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్య కార్యక్రమం

మానవపాడు: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం డాక్టర్ రిజ్వానా తస్నీర్ ఆధ్వర్యంలో ఆరోగ్య కార్యక్రమం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలంలోని 73 మంది మహిళలకు 8రకాల వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్యానారాయణ, చంద్రన్న, సంధ్యారాణి, తిరుమల్‌రావు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడుదాం

గట్టు: బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచ్ ధనలక్ష్మి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బాలల సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. బాలల హక్కులు, చట్టాలు, టోల్ ఫ్రీ నెంబర్స్, గుడ్‌టచ్ బ్యాడ్ టచ్, బాల్య వివాహాల నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం సీఆర్ డబ్ల్యూ లక్ష్మీదేవి, వీసీపీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావు, హెడ్మాస్టర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బూత్‌లెవల్ ఏజెంట్ల నియామకం



శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని తొమ్మిది బూత్‌లకు సంబంధించిన ఏజెంట్లను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు చిన్నిబాబు, టౌన్ ఇన్‌చార్జ్ గిత్తల దేవరాజు తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం బూత్‌లెవల్ ఏజెంట్లతో సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించి నియామక పత్రాలు అందజేసినట్లు వారు పేర్కొన్నారు.

ఘనంగా నందికోల సేవ



ధరూరు: మండల కేంద్రంలోని శివాలయం వద్ద శ్రావణ మాసం సందర్భంగా సోమవారం రాత్రి నందికోల సేవ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి 9గంటల నుంచి తెల్లవారు జాము వరకు నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రవీంద్రభారతికి తరలిన నాయీబ్రాహ్మణులు



అయిజ: హైదరాబాద్‌లోని రవీంద్రభారతికి మంగళవారం నాయీబ్రాహ్మణ సేవా సంఘం నాయకులు అయిజ నుంచి తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణసేవా సంఘం పట్టణ అధ్యక్షుడు శేఖర్, జిల్లా ప్రచార కార్యదర్శి సోమశేఖర్, అలంపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు గోవిందు, మండల అధ్యక్షుడు మహేష్, ఉపాధ్యక్షుడు సూర్య చంద్ర పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి సంచారం

మానవపాడు: మండల కేంద్రంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన మతిస్థిమితం లేని వ్యక్తి సంచరిస్తున్నట్లు స్థానికులు గుర్తించి ఆయనను మంగళవారం ఎస్ఐ రాముకి అప్పగించారు. ఆ వ్యక్తిని జాతీయ రహదారిపైకి తీసుకెళ్లి కర్ణాటక రాష్ట్రం వైపు వెళ్తున్న వాహనంలో ఎక్కించి పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

- సీడీపీఓ కమలాదేవి

మల్దకల్: పోషకాలు ఎక్కువ ఉండే ఆహారం తీసుకోవడం ద్వారానే బాలికలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ కమలాదేవి సూచించారు. పోషణ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం మల్దకల్ కస్తూర్బా బాలికల పాఠశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బాలికలు పోషకాలు ఎక్కువ ఉండే పాలు, గుడ్లు, ఆకుకూరలు తీసుకోవాలన్నారు. బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ విజయలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, బాలమ్మ, టీచర్లు లక్ష్మీరంగమ్మ, సురేఖ, మహేశ్వరమ్మ, పుష్పమ్మ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన


మేడికొండలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ కమలాదేవి

అయిజ: బాలల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీడీపీఓ కమలాదేవి అన్నారు. మండలంలోని మేడికొండలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వీసీపీసీ సమావేశం నిర్వహించారు. బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్‌ప్రొటెక్షన్ లీగల్ ఆఫీసర్ శివ, గ్రామ పంచాయతీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అర్హులకు కొత్త రేషన్ కార్డులివ్వాలి


గట్టులో ఆందోళన చేస్తున్న మహిళలు

గట్టు: అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులను ఇవ్వాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా)ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేస్తూ, పేద ప్రజలందరికీ కొత్త రేషన్ కార్డులను ప్రభుత్వం జారీ చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలన్నింటికి రేషన్ కార్డుకు లింకు పెట్టారని, చాలా మందికి రేషన్ కార్డుల్లేక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మహిళలు రాధమ్మ, సుజాత, అంజనమ్మ, కేశమ్మ, లక్ష్మి, జయమ్మ, బజారమ్మ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు వ్యతిరేకించాలి


పౌష్టికాహారం గురించి వివరిస్తున్న వాసంతి

గట్టు: బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని అంగన్‌వాడీ సూపర్ వైజర్ వాసంతి తెలిపారు. మంగళవారం మాచర్ల సెక్టార్ పరిధిలోని అంతంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసంలో భాగంగా పౌష్టికాహారం, బాలల కమిటీ పర్యవేక్షణ, పోషణ లోపాలు అధిగమించే అంశాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టే రోజువారి కార్యక్రమాల గురించి పిల్లల తల్లిదండ్రులకు, కమిటీ సభ్యులకు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయగౌడు, అంగన్‌వాడీ టీచర్, పంచాయతీ కార్యదర్శి, హెడ్మాస్టర్, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

'బేటీ బచావో బేటీ పడావో' పథకంపై అవగాహన


నందిన్నె పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న జిల్లా మహిళా సాధికారత బృందం

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు 'బేటీ బచావో..బేటీ పడావో' పథకంపై జిల్లా కో–ఆర్డినేటర్ జ్యోత్స్న అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు బాల్య వివాహాలు, బాలల హక్కులు, బాలలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాలల అక్రమ, రవాణా, బాలబాలికల ఆరోగ్య జాగ్రత్తలు, బాల కార్మికుల నివారణ, చైల్డ్ లైన్ 1098 తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహేష్, జెండర్ స్పెషలిస్ట్ సరోజ, చిట్టెమ్మ, విద్యార్థులు ఉన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి సన్మానం


సందీప్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లికి చెందిన సందీప్ ఇటీవల నీట్‌లో ఎంబీబీఎస్‌లో సీటు సాధించాడు. ఈ విషయం తెలుసుకున్న ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మంగళవారం కాంగ్రెస్ నాయకులతో వెళ్లి అభినందించి పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పటేల్ ప్రభాకరెడ్డి, దీపక్‌ప్రజ్ఞ, సర్పంచ్ రవి, రాజ్‌కుమార్, కమలాకర్ ఉన్నారు.

కమీషన్లలో ప్రజాప్రతినిధుల వాటా ఎంత?


సమావేశంలో మాట్లాడుతున్న శెట్టి ఆత్మకూర్ లక్ష్మణ్

గద్వాల అర్బన్: దళిత బంధు పథకం కమీషన్లలో ప్రజా ప్రతినిధుల వాటాలెంత అని కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి శెట్టి ఆత్మకూర్ లక్ష్మణ్ విమర్శించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్లలో అవినీతి రాజ్యమేలుతుందని ఆరోపించారు. దళిత బంధు పథకంలో కమీషన్లు అడిగిన వారిపై బీఆర్‌ఎస్ పార్టీ చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో తిమ్మప్ప, ఆంజనేయులు, నర్సింహులు, విజయ్ ఉన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

అయిజ: పురపాలక సంఘం కార్యాలయంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్‌ను, వర్కర్స్‌ను పర్మినెంట్ చేయాలని మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నర్సయ్యకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రనాథ్, టౌన్ ప్రసిడెంట్ నరేష్‌లు మాట్లాడారు. ఇకనుంచి నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తూ శాంతియుతంగా సమ్మె చేస్తామని తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాగరాజు, ఆంజనేయులు, మధుబాబు ఉన్నారు.

రుణమాఫీకి సహకరించండి


బ్యాంకు మేనేజర్‌కు వినతి పత్రం అందిస్తున్న కార్మికులు

రాజోళి: ప్రభుత్వం కార్మికులకు అందిస్తున్న రుణమాఫీకి సహకరించాలని చేనేత కార్మికులు యూనియన్ బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందచేశారు. చేనేత కార్మికులు మంగళవారం రాజోళిలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నిషాక్ ఆధ్వర్యంలో బ్యాంకు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆగస్టులో చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, చేనేత జౌళి శాఖ అధికారులకు కార్మికుల వివరాలు అందకపోవడంతో ప్రక్రియలో జాప్యం జరిగే అవకాశముందన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వస్తే కార్మికులకు మాఫీ వర్తించదని, ఆలోపే రుణమాఫీకి సహకరించాలని చేనేత కార్మికులు కోరారు. కార్యక్రమంలో చేనేత శ్రామిక సేవా సమితి సభ్యులు వీరేష్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


నిరవధిక సమ్మెలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఏమేలమ్మ

అలంపూర్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏమేలమ్మ డిమాండ్ చేశారు. అలంపూర్ మున్సిపాలిటీలో రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ నిరవధిక సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరింది. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మాట్లాడారు. పాండిచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల్లో వలే ఇక్కడ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ, అంగన్‌వాడీ టీచర్లు శాంతమ్మ, వరలక్ష్మి, నర్మద, భారతి, సుమలత, మునీశ్వరి, రాములమ్మ, ఆయాలు రంగమునెమ్మ, వసంతమ్మ, చిట్టెమ్మ, ఏసమ్మ, నాగమునెమ్మ ఉన్నారు.

దేశ గౌరవం కాపాడటం అందరి బాధ్యత


కుర్వపల్లిలో మట్టిని తీసుకుంటున్న నాయకులు


యక్తాపురంలో..

గద్వాల: దేశ గౌరవాన్ని, స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ముగింపు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బీజేపీ నాయకులు 'మేరా మిట్టి.. మేరా దేశ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని కాకులావరం, కుర్వపల్లి, బస్రచెరువు, అనంతపురం గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, తిరుపతి, క్రిష్ణమూర్తి, నరేందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, జయసింహ, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో మట్టి సేకరణ..

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని యక్తాపురంలో మంగళవారం బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్ ఆధ్వర్యంలో మట్టి సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షుడు కేకే రెడ్డి, శంకర్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఉన్నారు.

జమ్ములమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే బండ్ల

గద్వాల రూరల్: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు మంగళవారం రాత్రి జమ్ములమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వారివెంట రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య, సతీష్‌కుమార్ ఉన్నారు.

బీచుపల్లిని సందర్శించిన గద్వాల ఎమ్మెల్యే

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయాన్ని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సందర్శించారు. ఆంజనేయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మండపాలకు భారీ వినాయకులు

ధరూరు: వినాయక చవితిని పురస్కరించుకుని మండపాల్లో ప్రతిష్ఠించనున్న వివిధ రూపాల్లో ఉన్న భారీ వినాయక విగ్రహాలు పెద్ద ఎత్తున తరలి వెళ్తున్నాయి. గద్వాల–రాయచూరు రహదారిలో మంగళవారం రాత్రి రాయచూరుకు చెందిన యువకులు పార్వతీ పరమేశ్వరుడి రూపంలో ఉన్న భారీ విగ్రహాన్ని రూ.1.30లక్షలకు కొనుగోలు చేసి హైదరాబాద్ నుంచి ప్రత్యేక వాహనంలో తీసుకొచ్చారు. విగ్రహాన్ని తీసుకెళ్లడానికి 30మంది యువకులు ఇబ్బందులు పడుతూ తీసుకెళ్లారు.

విద్యార్థులకు ప్రశంస

అయిజ: జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన 67వ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచిన అయిజ పట్టణానికి చెందిన విద్యార్థులను మంగళవారం తైక్వాండో మాస్టర్లు మధుకుమార్, షేక్షావలి ఆచారి, సుధీర్ అభినందించారు. భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరెన్నో పతకాలు సాధించాలని కోరారు.

గర్భిణులు జాగ్రతలు తీసుకోవాలి



రాజోళి: గర్భిణులు ప్రారంభం నుంచి ఆరోగ్య జాగ్రతలు తీసుకోవాలని ఆరోగ్య సిబ్బంది తెలిపారు. మండలంలోని పెద్ద తాండ్రపాడు, ముండ్లదిన్నె, అశోక్‌నగర్ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరాతీశారు. పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో జయప్రకాష్, రంజిత్ కుమార్, రామకృష్ణ, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గద్వాలకు బీఆర్‌ఎస్ శ్రేణులు

ధరూరు: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు గద్వాలకు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో మంగళవారం గద్వాలలో స్వాగత ర్యాలీకి తరలి వెళ్లారు.

నేటి నుంచి మధ్యాహ్న భోజనం బంద్



గట్టులో ఆందోళన చేస్తున్న వంట ఏజెన్సీ నిర్వాహకులు

గట్టు: పెండింగ్ బిల్లుల చెల్లింపులో జాప్యానికి నిరసనగా బుధవారం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిలిపేస్తున్నట్లు వివిధ గ్రామాలకు చెందిన వంట ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. మంగళవారం వివిధ గ్రామాలకు చెందిన వంట ఏజెన్సీ నిర్వాహకులు ఎంఈఓ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. అనంతరం ఎంఈఓ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు శేషన్న మాట్లాడుతూ వంట ఏజెన్సీ కార్మికులకు చెల్లించాల్సిన జీతాలను వెంటనే చెల్లించాలన్నారు. ఆరు నెలలుగా మధ్యాహ్న భోజన బిల్లులు పెండింగ్‌లో ఉండడం వల్ల వంటలు చేయలేక పోతున్నామన్నారు. 13 నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిలిపేస్తున్నట్లు ప్రకటించారు.